క్లుప్తంగా

వైఎస్సార్ బీమా నగదు అందజేత



తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరులో గురువారం అనారోగ్యంతో చనిపోయిన ఓ వ్యక్తికి మట్టిఖర్చుల నిమిత్తం వైఎస్సార్ బీమా కింద రూ.10వేలు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గంపల గంగాధర్ మాట్లాడుతూ దుగ్గిరాల మండలం పేరుకలపూడి గ్రామానికి చెందిన దాది నాగమల్లేశ్వరి అనారోగ్యంతో మృతి చెందిందని, వైఎస్సార్ బీమా కింద ఆమె కుమారుడు దాది అంకారావుకు రూ.10వేలు అందజేశామని ఆయన తెలిపారు. పంచాయతీ సెక్రటరీ నస్రత్ సుల్తానా, వెల్ఫేర్ అసిస్టెంట్ రవి కిరణ్, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

చరిత్ర అధ్యాపకుడు ప్రకాశంకు పీహెచ్‌డీ



తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లికి చెందిన చరిత్ర అధ్యాపకుడు బెజ్జం ప్రకాశంకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ గురువారం పీహెచ్‌డీని ప్రదానం చేసింది. ఆయన దళిత్ రిలీజియస్ కన్వర్షన్స్ అండ్ కాన్సిక్వెన్సెస్ – హిస్టారికల్ పర్‌స్పెక్టివ్ అనే అంశం మీద పరిశోధన చేశారు. ఈ అంశానికి నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపరాణి ప్రకాశంకు సూపర్ వైజర్‌గా వ్యవహరించారు. ఆయన ప్రస్తుతం విజయవాడ నగరంలోని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర విభాగ అధిపతిగా విధులు నిర్వహిస్తున్నారు. డాక్టరేట్ పొందిన ప్రకాశంను పలువురు నగర వాసులు అభినందించారు.

షిరిడీ సాయిబాబాను దర్శించుకున్న పురందేశ్వరి



మంగళగిరి: కార్పొరేషన్ పరిధి పెదవడ్లపూడిలో వేంచేసియున్న భగవాన్ సత్య షిరిడీ సాయిబాబా మందిరాన్ని గురువారం ఏపీ బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధరేశ్వరి సందర్శించి బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు పాతూరి నాగభూషణం ఆమెకు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికి, దుశ్శాలువా కప్పి బాబా చిత్రపటాన్ని బహూకరించారు. అనంతరం మందిరం ఆవరణలోని శ్రీ కృష్ణుడి విగ్రహాన్ని దర్శించుకుని పూజలు నిర్వహించి ఉట్టికొట్టే కార్యక్రమంలో పాల్గొన్నారు. అక్కడి నుంచి దేవస్థానం సమీపంలోని గోశాలను సందర్శించి గోపూజ నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాటిబండ్ల రామకృష్ణ, ఆలయ సెక్రటరీ పాతూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో విద్యుత్ విజి'లెన్స్'

గుంటూరు ఈస్ట్: విద్యుత్ శాఖ విజిలెన్స్, ఆపరేషన్ సంయుక్త విభాగాల ఆధ్వర్యంలో నగరంలోని డీ–5 సెక్షన్ పరిధిలోని మంగళదాస్‌నగర్, ఇజ్రాయిల్‌పేట, గాంధీనగర్, బసవతారకనగర్, ఆర్టీసీ కాలనీ ప్రాంతాల్లో గురువారం తనిఖీలు నిర్వహించారు. 56 మంది అధికారులు, 168 మంది సిబ్బంది, 56 బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేశారు. 4,598 సర్వీసులను తనిఖీ చేసి అనుమతి లేకుండా నేరుగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 289 మందికి రూ. 14.48 లక్షలు అపరాధ రుసుము విధించారు. అనుమతించిన కేటగిరి కాక ఇతర కేటగిరిల్లో విద్యుత్ వాడుతున్న వ్యక్తికి రూ. 50 వేలు అపరాధ రుసుము విధించారు. అనుమతించిన లోడుకంటే అదనంగా విద్యుత్ వాడుతున్న 253 మందికి రూ. 13.48 లక్షల అపరాధ రుసుము విధించారు. అసలు వాడకం కంటే బిల్లు తక్కువగా వచ్చిన ఐదు సరీ్వసులు గుర్తించి రూ. 50 వేలు అపరాధ రుసు ము విధించారు. ఈసందర్భంగా ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ టి.శ్రీనివాసబాబు మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులు విద్యుత్ మీటర్లకు తప్పనిసరిగా సీలు ఉండేలా నిర్ధారించుకోవాలన్నారు. సీలు లేకపోయినా, తుప్పుపట్టి ఊడినా వెంటనే సంబంధిత విద్యుత్ సిబ్బందికి రాతపూర్వకంగా తెలియజేయాలన్నారు. అధికారుల తనిఖీల్లో సీలు లేకపోయినా విద్యుత్ చౌర్యంగా నిర్ధారించి కేసు నమోదు చేయడం జరుగుతోందన్నారు. పనిచేయని విద్యుత్ మీటరు నుంచి విద్యుత్ వాడుకున్నా, ఉండవల్సిన మీటరు బదులు వేరే మీటరు పెట్టినా విద్యుత్ చౌర్యంగా నిర్ధారిస్తామన్నారు. మొదటిసారి తప్పిదానికి కాంపౌండింగ్ పద్ధతిలో అపరాధ రుసుము విధిస్తారన్నారు. రెండోసారి తప్పిదానికి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించడం జరుగుతోందన్నారు. అపరాధ రుసుము చెల్లించలేని పరిస్థితిల్లో రెవె న్యూ రికవరీ చట్టం ఉపయోగించి ఆస్తులు జప్తు చేయడం జరుగుతోందన్నారు. మొదటిసారి తప్పిదానికి మూడు రెట్లు, రెండో సారి తప్పిదానికి ఆరు రెట్లు జరిమానా విధించే అవకాశం విద్యుత్ చట్టంలో ఉందన్నారు. విద్యుత్ చౌర్యం జరుగుతున్నట్లు తెలిస్తే సెల్ 9440812263, 9440812360 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. దాడుల్లో డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ఎం.రవికుమార్, కె.రవికుమార్, పఠాన్ హుస్సేన్ ఖాన్, ఏఈలు కె.కోటేశ్వరరావు, షేక్ మస్తాన్‌వలి, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమం ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం వైఎస్ జగన్ పాలన
- గడప గడపకు మన ప్రభుత్వంలో సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్



లచ్చన్న గుడిపూడిలో వృద్ధురాలి సమస్యలు తెలుసుకుంటున్న కత్తెర సురేష్ కుమార్

లచ్చన్నగుడిపూడి(తాడికొండ): రాష్ట్రంలో కులం, మతం, ప్రాంతం, పార్టీ భేదం లేకుండా సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా ప్రజలకు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. గురువారం తాడికొండ మండలం లచ్చన్న గుడిపూడి గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు సుదీర్ఘ పాదయాత్ర చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పేదవాడి కష్టాలు తెలుసుకొని సంక్షేమ పథకాలను రూపొందించి నవరత్నాల ద్వారా అందరి సమస్యలు తీర్చాడన్నారు. ప్రతి పేదవాడిని లక్షాధికారిని చేసేందుకు రాష్ట్రంలో ఇళ్లు లేని నిరుపేదలకు 35 లక్షల ఇళ్ల స్థలాలు, అందులో పక్కా ఇళ్లు నిర్మించడంతో పాటు రైతులకు రైతు భరోసా, మహిళలకు డ్వాక్రా రుణాల మాఫీ, సున్నా వడ్డీ, ఆసరా పథకం, చిన్నారులు, విద్యార్థులకు అమ్మ ఒడి, నాడు – నేడు, వృద్ధులు దివ్యాంగులకు పింఛన్‌లు పెంపు, యువతకు పెద్దఎత్తున ఉద్యోగాల కల్పన వంటి పలు అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందించినందునే నేడు గడపగడపలో ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. భారతదేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి అందించని విధంగా సంక్షేమ పథకాలను అందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శంగా నిలవడంతో పలు రాష్ట్రాలు నేడు ఏపీని అనుసరిస్తున్నాయన్నారు. అధికారం అడ్డుపెట్టుకొని దోచుకొని దాచుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్న చంద్రబాబు నాయుడు 14 సంవత్సరాల పాటు రాష్ట్రాన్ని అన్ని రకాలుగా తాను దోచుకోవడంతో పాటు తన అనునాయులకు దోచిపెట్టాడనేందుకు చిట్‌ఫండ్ సంస్థ మోసాలతో ప్రజలను నిలువునా ముంచిన రామోజీయే నిదర్శనమన్నారు. అమరావతి పేరుతో కాంట్రాక్టులు అధిక ధరలకు కట్టబెట్టి నిర్మాణ సంస్థలకు లబ్ధిచేకూర్చిన చంద్రబాబు 118 కోట్లకు పైగా దొడ్డిదారిలో లబ్ధి పొందినట్లు గుర్తించిన ఐటీ శాఖ నోటీసులు ఇస్తే బాబు విచారణకు హాజరు కాకుండా బొంకడం వెనుక అరెస్టు భయం కాదా అని ప్రశ్నించారు. అమరావతి పేరుతో రూ.లక్షల కోట్లు దోపిడీ చేసిన చంద్రబాబును అరెస్టు చేసి విచారణ చేస్తే మరింత అవినీతి బయటపడే అవకాశం ఉందని, రాష్ట్రంలో అల్లర్లకు కారణమవుతున్న బాబును వెంటనే అదుపులోకి తీసుకోవాలన్నారు. అమరావతిలో 54 వేల మంది పేదలకు ఒక్కొక్కరికి సెంటు స్థలం ఇస్తే వందలాది తప్పుడు కేసులు వేయించి స్టేలతో అడ్డుకున్న బాబు పేదల ద్రోహి అన్నారు. మార్కెట్ యార్డు చైర్మన్ చిమటా పూర్ణచంద్రరావు, ముక్కామల, కంతేరు, నిడుముక్కల గ్రామ సర్పంచ్‌లు చిమటా వెంకటేశ్వర్లు, బెజ్జం మహేష్ బాబు, మాదాసు రత్నకుమారి, లచ్చన్న గుడిపూడి మాజీ సర్పంచ్ గునుగునూరి సాంబిరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా వెంకటేశ్వరరెడ్డి, పలు విభాగాల నాయకులు భీమవరపు బ్రహ్మరెడ్డి, అవుతు శ్రీనివాసరెడ్డి, కొల్లికొండ వెంకటేశ్వరరావు, పసుపులేటి వెంకట్రావు, బోడపాటి ధర్మరాజు, మాదాసు ఏసురత్నం, బాకి వెంకటస్వామి, బాజీ పాల్గొన్నారు.

కరకట్టలోకి జారిన ఆర్టీసీ బస్సు

- డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన పెనుప్రమాదం
- దుగ్గిరాల మండలం గొడవర్రు వద్ద ఘటన



గొడవర్రు వద్ద కరకట్ట కిందకు వాలిపోయిన ఆర్టీసీ బస్సు



ఎమర్జెన్సీ ద్వారం నుంచి ప్రయాణికులను కిందకు దించుతున్న స్థానికులు

తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని గొడవర్రు వద్ద ఆర్టీసీ బస్సుకు పెనుప్రమాదం తప్పింది. గురువారం విజయవాడ నుంచి రేపల్లె వెళ్లే ఆర్టీసీ బస్సు అదుపుతప్పి కరకట్ట కిందకు జారింది. డ్రైవర్ అప్రమత్తమై బస్సు బోల్తా పడకుండా నియంత్రించాడు. వివరాల్లోకి వెళితే.. రేపల్లె డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఉదయం 9 గంటలకు విజయవాడ నుంచి 30 మంది ప్రయాణికులతో రేపల్లెకు వెళుతుంది. గొడవర్రు వద్ద కరకట్ట నిర్మాణం పూర్తిగా జరగకపోవడంతో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డు గోతులమయమైంది. గొడవర్రు వద్ద కరకట్ట మీద ఉన్న గోతులను తప్పించేందుకు ఆర్టీసీ డ్రైవర్ కరకట్ట అంచుభాగానికి రావడంతో బస్సు ఎడమవైపు ఎదురు టైరు జారిపోయింది. వెనుక టైరు కూడా జారడంతో డ్రైవర్ అప్రమత్తమై కరకట్ట కిందకు దిగుతున్న బస్సు స్టీరింగ్‌ను కుడివైపునకు తిప్పడంతో బస్సు బోల్తా పడకుండా కట్టపై భూమికి ఆనుకుని నిలిచిపోయింది. అంతలో బస్సులో ఉన్న ప్రయాణికులు పెద్ద పెద్దగా కేకలు వేయడంతో అక్కడే ఉన్న ఎంపీటీసీ కొండూరు సుమన్ గ్రామస్తుల సహాయంతో ఆర్టీసీ బస్సు ఎమర్జెన్సీ డోరు తీసి స్థానికుల సహాయంతో 30 మంది ప్రయాణికులను కిందికి దించారు. వెంటనే ఇరిగేషన్ అధికారులు కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసును పరిష్కరించి రోడ్డు నిర్మించాలని స్థానికులు డిమాండ్ చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం తగదు

తాడికొండ: నియోజకవర్గంలోని ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. గుంటూరులోని తన కార్యాలయంలో ఎంపీడీఓలు, గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాగునీటి, రోడ్ల సమస్యలు ఎక్కడైనా ఉంటే గుర్తించి తక్షణ పరిష్కారం చేయాలని సూచించారు. వివిధ పనులపై కార్యాలయాలకు వచ్చే ప్రజలకు జవాబుదారీ పాలన అందించాలన్నారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో నిధులు మంజూరై ప్రారంభం కాకుండా ఉంటే ఆయా పనులను వెంటనే ప్రారంభించడంతో పాటు నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ భవనాలు, రోడ్లు త్వరితగతిన పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. మండలాల పరిధిలోని పలు పనులు, ఇతర వివరాలను అడిగి తెలుసుకొని అధికారులకు పలు సూచనలిచ్చారు. 4 మండలాల ఎంపీడీఓలు, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

దుకాణాల్లో వరుస చోరీలు

పెదనందిపాడు: దుకాణం తాళాలు పగులగొట్టి, నగదు దోచుకెళ్లిన ఘటన పెదనందిపాడులో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. బాధితుల వివరాల మేరకు.. పెదనందిపాడు రామాలయం ఎదురుగా ఉన్న టీ స్టాల్‌లో రూ.10వేలు, పక్కనున్న సంగం డెయిరీ పార్లర్‌లో రూ.43వేలు నగదు దోచుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. ఘటనా స్థలాన్ని క్లూస్ టీమ్ పరిశీలించి, ఆధారాలు సేకరించింది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అబ్దుల్ రెహమాన్ తెలిపారు. ఈ ఘటనతో పోలీస్‌లు రాత్రిళ్లు గస్తీ పెంచాలని స్థానికులు కోరుతున్నారు.

9న గుంటూరులో యానాదుల రాజకీయ భేరి

నెహ్రూనగర్: యానాదుల పొలిటికల్ ఫోరం ఆధ్వర్యంలో గుంటూరులో ఈ నెల 9న యానాదుల రాజకీయ భేరి బహిరంగ సభ బీఆర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు యానాదుల పొలిటికల్ ఫోరం రాష్ట్ర కన్వీనర్లు కేసీ కల్లూరు చిన పెంచలయ్య, యందేటి వెంకట సుబ్బయ్యలు తెలియజేశారు. ఈ మేరకు గురువారం అంబేడ్కర్ భవన్‌లో రాజకీయ భేరి బహిరంగ సభకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో పది లక్షల జనాభా కలిగిన యానాదులకు ప్రత్యే క కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, ఎమ్మెల్సీ పదవి కేటాయించి రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బాపట్ల బ్రహ్మయ్య, కె.సూరిబాబు, పొన్నూ రు అంకమ్మరావు, మన్యం కోటయ్య, ఆర్ మధు, శ్రీనివాసులు, రాజు పాల్గొన్నారు.

వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు



విశేష అలంకారంలో వేణుగోపాల స్వామి



ఫిరంగిపురం గీతామందిరం వద్ద ఉట్టి కొడుతున్న భక్తులు



దుగ్గిరాలలో అన్నదానం చేస్తున్న ఎంపీపీ సంతోష రూపవాణి, జెడ్పీటీసీ మేకతోటి అరుణ

ఫిరంగిపురం: మండలంలోని 113 త్యాళ్లూరు, నుదురుపాడు, యర్రగుంట్లపాడు, తక్కెళ్లపాడు, హౌస్‌గణేష్, గొల్లపాలెం గ్రామాల్లోని ఆలయాలు, మందిరాల వద్ద శ్రీకృష్ణాష్టమి వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించారు. 113 త్యాళ్లూరులోని కృష్ణ మందిరం వద్ద శ్రీకృష్ణ విగ్రహానికి పూజలు చేసి ఉట్టిగొట్టే కార్యక్రమం నిర్వహించారు. ఫిరంగిపురంలోని గీతామందిరం వద్ద స్వామివారికి అర్చకులు విశేష పూజలుచేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆర్యవైశ్య మహిళామండలి, గీతా భజనమండలి ఆధ్వర్యంలో గీతాపారాయణం, కోలాట ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో ఉట్టిని ఏర్పాటుచేసి రంగు నీరు జల్లుకుంటు భక్తులు ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు.

తాడేపల్లిలో...

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలో గురువారం శ్రీకృష్ణాష్టమి సందర్భంగా పలు ప్రాంతాల్లో అంగరంగ వైభవంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహానాడు 14,18, 20వ రోడ్లలో జరిగిన కృష్ణాష్టమి వేడుకల్లో మంగళగిరి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకులు, గుంటూరు మిర్చియార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారీఎత్తున భక్తులు కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్నారు. పూజలతో పాటు అన్న సంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉండవల్లి, పోలకంపాడు, కొలనుకొండ ప్రాంతాల్లో కృష్ణాష్టమి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించి అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. ఉండవల్లిలో, మహానాడులో సాయంత్రం ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో యువతీ, యువకులు భారీగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉండవల్లి మాజీ ఎంపీటీసీ మేకల హనుమంతరావు, కిషోర్ యాదవ్, రాంబాబు, హరీష్, సత్యనారాయణ, బత్తుల ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాలలో...

తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండల పరిషత్ కార్యాలయంలో గురువారం కృష్ణాష్టమి వేడుకలు ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యాలయంలో కృష్ణుని విగ్రహానికి దుగ్గిరాల మండల పరిధిలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దుగ్గిరాల మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో జరిగిన కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో అన్న సంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ బాజి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు దానబోయిన వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వడ్డేశ్వరం రజనీకాంత్, శృంగారపాటి రత్నం, వైఎస్సార్ సీపీ నాయకులు దాసరి వీరయ్య, కంభపాటి క్రాంతికుమార్, సర్పంచ్‌లు గంపల గంగాధర్, పలుకూరి మేరి, పాటిబండ్ల కృష్ణ ప్రసాద్, షేక్ అజీజాన్, బోళ్ల శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఇస్కాన్ టెంపుల్‌లో...



ఇస్కాన్ టెంపుల్‌లో ప్రత్యేకంగా అలంకరించిన రాధాకృష్ణుల విగ్రహం

తాడేపల్లి రూరల్: కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా ఉండవల్లి అమరావతి కరకట్ట వెంబడి కృష్ణాతీరంలోని ఇస్కాన్ టెంపుల్‌లో భక్తిశ్రద్ధలతో ఇస్కాన్ టెంపుల్ నిర్వాహకుడు రాధా శ్యామ్ సుందర్ ప్రత్యేక పూజా కార్యక్రమాలు గురువారం ఉదయం నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు నిర్వహించారు. రాధా కృష్ణులను నూతన వస్త్రాలతో అత్యంత రమణీయంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. ఉదయం నుంచి రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు ఇస్కాన్ టెంపుల్‌కు విచ్చేశారు. భక్తులు హరినామ సంకీర్తనలు, నృత్యాల మధ్య స్వామివారికి సాయం సమయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి సమయంలో రాధా శ్యామ్ సుందర్‌లకు పంచామృతాలతో, మహా శంఖాభిషేకాలు నిర్వహించారు. శ్రీమన్ చక్రధారి దాసు శ్రీకృష్ణుడి అవతారంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మాజీ ఎంపీ గోకరాజు గంగరాజుతో పాటు ఐఏఎస్ అధికారులు ఎం.గిరిజా శంకర్, పీఎస్ ప్రద్యుమ్న తదితరులు పాల్గొన్నారు.

ఒంటరి వృద్ధురాలికి ఎమ్మెల్యే రూ.50వేలు ఆర్థికసాయం



మృతుడు ఏసుబాబు తల్లికి రూ.50వేలు అందజేస్తున్న జెడ్పీటీసీ దాసరి అరుణ

తాడేపల్లి రూరల్: కట్టుకున్న భర్త గత కొన్నేళ్ల క్రితం మృతి చెందగా ఉన్న ఒక్కగానొక్క కొడుకును పెంచి పోషించుకుని చేతికి అందివచ్చిన సమయంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అతను కూడా మృత్యువాత పడటంతో ఆ తల్లి అనాథగా మిగిలింది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) గురువారం ఆమెకు రూ. 50వేల ఆర్థిక సహాయాన్ని అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా దుగ్గిరాల జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి అరుణ మాట్లాడుతూ కంఠంరాజు కొండూరులో నివాసం ఉండే అల్లూరి ఏసుబాబు వాటర్ క్యాన్లు ఇంటింటికి తిరిగి ఇస్తుంటాడు. ఈనెల 6వ తేదీ కంఠంరాజు కొండూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో బోల్తాకొట్టి ఏసుబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని తల్లి రోజా ఒంటరి మహిళ కావడం, ఆమె ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉండటంతో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుల ద్వారా సమాచారం అందుకున్న ఎమ్మెల్యే ఆర్కే మృతుని తల్లికి రూ.50వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ షేక్ బాజి, సర్పంచ్ ఉన్నం రఘునీ, ఉప సర్పంచ్ నాగలక్ష్మి, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వడ్డేశ్వరం రజనీకాంత్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు దానబోయిన వెంకటేశ్వరరావు, శృంగారపాటి రత్నం, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

మృతుని అంత్యక్రియలకు ఆర్థికసాయం అందజేత...

దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరుకు చెందిన కోటేశ్వరరావు మృతివార్త తెలుసుకున్న ఎమ్మెల్యే ఆర్కే ఆయన కుటుంబానికి గురువారం ప్రగాఢ సానుభూతిని తెలిపి స్థానిక నాయకుల ద్వారా రూ.10వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉన్నం రఘునీ, ఎంపీటీసీ సభ్యులు షేక్ మహబూబ్ సుభానీ, బాబు, సచివాలయ కన్వీనర్ పావూరి అశోక్, వార్డు సభ్యులు పాల్గొన్నారు. అదేవిధంగా దుగ్గిరాల మండల పరిధిలో ఈమని గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన చొక్కా కౌసల్యమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె మరణవార్త స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే ఆర్కే ఆమె కుటుంబానికి మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు పిల్లి ధర్మరత్నం, ముత్తే ఆనందబాబు, కాంతారావు, జమ్ముల లోకేష్ పాల్గొన్నారు.

చర్మకారుల సమస్యలు పరిష్కరించాలి

నగరంలో చర్మకారులు, డప్పు కళాకారుల ప్రదర్శన



నగరంలో ప్రదర్శన నిర్వహిస్తున్న చర్మకారులు, డప్పు కళాకారులు

మంగళగిరి: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నగరంలో చర్మకారులు, డప్పు కళాకారులు గురువారం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ సెంటర్, కొత్త బస్టాండ్ సెంటర్‌లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవనరామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకుముందు స్థానిక పెన్షనర్స్ హోమ్‌లో చర్మకారులు, డప్పు కళాకారుల సమస్యలపై ఆంధ్రప్రదేశ్ చర్మకార సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి సమస్యలపై చర్చించారు. సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బుల్లా రాజారావు, దున్న నాగయ్య, గుంటూరు, కృష్ణా జిల్లాల చర్మకార సంక్షేమ సంఘం నాయకులు ప్రశాంతి, బుల్లా త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యరహిత వాతావరణంలోనే స్వచ్ఛమైన గాలి

మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ గంగాధర్ ప్రసాద్



ఎంవీఐ గంగాధర్ ప్రసాద్‌కు మొక్క అందజేస్తున్న విద్యార్థిని

గుంటూరు ఎడ్యుకేషన్: కాలుష్యానికి తావులేని వాతావరణంతోనే స్వచ్ఛమైన గాలిని పీల్చగలమని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ గంగాధర్ ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయ ఆధ్వర్యంలో ప్రపంచ స్వచ్ఛ వాయువు దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గంగాధర్ మాట్లాడుతూ మన ఆరోగ్యం స్వచ్ఛంగా ఉండాలి అంటే వాతావరణం కలుషితం కాకుండా చూడాలని, ప్రాణ కోటికి అతి ముఖ్యమైన వాయువును శుభ్రంగా చూసుకునే బాధ్యత మనందరి పైన ఉందని పేర్కొన్నారు. వాతావరణ కాలుష్యం కలిగించే వాహనాలను ఉపయోగించవద్దని సూచించారు. ఐటీసీ పర్యావరణ సమన్వయకర్త నారాయణ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి బాధ్యతగా ఇంటికి ఒక చెట్టును నాటి, పరిరక్షించాలని, అటువంటప్పుడు పరిశుభ్రమైన వాయువు సమాజానికి ఇవ్వగలుగుతామని సూచించారు. కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ సహాయ ఇన్‌చార్జ్ సుధా కురుబ మాట్లాడుతూ చెట్లు పెంచడం, పొగ వాహనాలు తక్కువగా వినియోగించడం, పరిసరాలు శుభ్రంగా ఉంచడం వంటివి చేయడం వలన పరిశుభ్రమైన గాలి మనకు వస్తుందని, అందరం సంతోషంగా, ఆరోగ్యంగా ఉండాలి అంటే ప్రాణ వాయువును కలుషితం కాకుండా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిగ్రీ, పీజీ కళాశాలల ప్రిన్సిపాల్స్ మనోహర్, అనితా దేవి, జాతీయ సేవా పథకం కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్ జె.వి.సుధీర్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణ హిత కార్యక్రమాలకు సహకరించాలి



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది

నెహ్రూనగర్: స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా నగరపాలక సంస్థ గుంటూరు నగరంలో చేపడుతున్న మొక్కల పెంపకం, పర్యావరణ హిత కార్యక్రమాలకు నగర ప్రజలు సహకరించా లని ఈఈ కొండారెడ్డి కోరారు. నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు గురువారం నగరపాలక సంస్థ అధికారులు, వార్డ్ సచివాలయ కార్యదర్శులు ఇంటర్నేషనల్ డే ఆఫ్ క్లీన్ ఎయిర్ ఫర్ బ్లూ స్కైస్‌లో భాగంగా స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ పై నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం నుంచి హిందూ కాలేజీ జంక్షన్ వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కొండారెడ్డి మాట్లాడుతూ నగరంలో వాయు స్వచ్ఛతకు నగరపాలక సంస్థ నుంచి ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే వార్డు సచివాలయాల వారీగా మొక్కల పెంపకంపై కార్యదర్శులకు ప్రత్యేక కార్యాచరణ కేటాయించామన్నారు. పరిశుభ్రమైన గాలి ప్రజారోగ్యానికి, ప్రశాంత వాతావరణానికి దోహదం చేస్తుందన్నారు. నగరపాలక సంస్థ వాయు కాలుష్యాన్ని నియంత్రించే కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య విభాగంలో ఇంటింటి చెత్త సేకరణకు ఈ–ఆటోలను అందుబాటులోకి తెచ్చిందని, త్వరలో నగరంలోని అన్ని వార్డ్ సచివాలయాలకు ఈ–ఆటోలు వస్తాయన్నారు. ర్యాలీలో సీఎంఓహెచ్ డాక్టర్ విజయలక్ష్మీ, ఎంహెచ్‌ఓ డాక్టర్ భాను ప్రకా ష్, డీఈఈ మధు, ఏఈ దుర్గా ప్రసాద్, సచివాలయ కార్యదర్శులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడుతున్న వ్యక్తిపై కేసు

పట్నంబజారు: స్థల యజమాని సంబంధం లేకుండా అక్రమ రిజిస్ట్రేషన్‌లకు పాల్పడుతున్న వ్యక్తిపై కేసు నమోదైంది. నగరంపాలెం పోలీసుల కథనం ప్రకారం.. చంద్రమౌళినగర్‌కు చెందిన కొమ్మినేని నాగమల్లేశ్వరి గోరంట్లలో ఉన్న తన స్థలాన్ని విక్రయించేందుకు వెంకటస్వామికి జీపీఏ చేసింది. ఈక్రమంలో వెంకటస్వామి నాగమల్లేశ్వరికి తెలియకుండా పలువురికి ఆస్థలాన్ని రిజిస్ట్రేషన్ చేశాడు. విషయం తెలుసుకున్న నాగమల్లేశ్వరి జీపీఏను రద్దు చేయించింది. అయినప్పటికీ వెంకటస్వామి ఆస్థలాన్ని మరికొందరికి రిజిస్ట్రేషన్ చేసినట్లు గుర్తించిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లాటరీ ఆడుతున్న నలుగురు అరెస్టు

పట్నంబజారు: సింగిల్ నంబరు లాటరీ ఆడుతున్న నలుగురిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నల్లచెరువు మూడు బొమ్మల సెంటర్ వద్ద ఓ గదిలో సింగిల్ నంబరు లాటరీ ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.3,200 నగదు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.